

## స్ఫూర్తినిచ్చే కథ

# పాలబ్బాయి

### ప్రఫుల్ల చంద్ర

పెళ్ళిచూపులు...

"అబ్బాయి గోపాల్ యం.సీ.ఏ. చదివి నెలకు దెబ్బయి వేలు పైగా సంపాదిస్తున్నాడట. వాళ్లు కోటీశ్వరులు. కట్న కానుకలపై ఆశ లేనివారు. మంచివాళ్లు" అని మధ్యవర్తి చెప్పాడు.

అమ్మాయి అర్చన బిటెక్ పాసై ఉద్యోగాన్వేషణలో ఉంది. అపరంజి బొమ్మ. ఈ పెళ్ళి జరిగితే ఇరువైపుల వారు అదృష్టవంతులే. అందుకని అమ్మాయి తరపు బంధువులు పెళ్లిచూపులు ఘనంగా ఏర్పాటుచేసి అతి వినయ విధేయతలు ప్రదర్శిస్తున్నారు. అంతా బాగానే ఉంది. కాని-

ఎక్కడ ఏం ఉద్యోగం చేస్తున్నావని గోపాల్‌ని ఒక తాతగారు అడగటంతో అబ్బాయి చెప్పిన సమాధానం అందరికీ షాక్ ఇచ్చింది.

అతడు ఉద్యోగం చెయ్యడం లేదు. ఆవులు పెంచుతూ పాడి పరిశ్రమ నిర్వహిస్తున్నాడట! పశువుల కాపరి, పాలబ్బాయి లాంటి మాటలు ఆ పనులు చేసే కులం జ్ఞాపకం వచ్చాయి కాబోలు. అంతవరకూ ఘనంగా మర్యాదలు చేసిన వాళ్ల ముఖాలు, వైఖరి, మాటతీరు మారిపోయాయి. అది గ్రహించిన అబ్బాయి బంధువులు లేచి "ఒకసారి మా ఇంటికొచ్చి చూడండి" అని మర్యాదగా ఆహ్వానించి వెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లాక అమ్మాయి బంధువులంతా "పాలు అమ్ముకోడానికి యంసీఏ ఎందుకు? ఆవుల తోకలకు, కొమ్ములకూ ఆ సర్టిఫికేట్లు తగిలించి ఊరేగడానికా? అసలు యంసీఏ చదివి ఉండడు. అద్దె బట్టలు వేసుకొని అద్దె కారులో వచ్చారు కాబోలు" అంటూ నవ్వుకున్నారు. గేలి చేశారు. ఎకసక్కాలాడారు.

అసలు వ్యక్తి అర్చన మాత్రం గంభీరంగా ఉండిపోయింది.

* * *

మర్నాడు ఇంటికొచ్చిన ఫ్రెండ్ లావణ్య పెళ్లిచూపుల విశేషాలు అడిగితే జరిగినదంతా చెప్పింది అర్చన.

ఇంతకూ నీ ఉద్దేశమేమిటని సూటిగా అడిగింది లావణ్య.

కాసేపు మౌనం వహించి "పాలు అమ్ముకునేవాడు అనగానే మన మనసులో చిందరవందర జుట్టు, నల్లని మొరటు శరీరం, గారపళ్లు, విద్యాగంధం లేని ముఖం- ఇలా ఒక రూపం కనిపిస్తుంది. కానీ వాళ్లు ఎంతో సంస్కారుల్లాగా కనిపించారు. బట్టలు, కారు అద్దెకు తెచ్చుకోగలం కానీ భాష, భావాలు, మాటతీరు అద్దెకు తెచ్చుకోలేం కదా! వాళ్లు వేషధారులు కారు" అంది అర్చన.

"గోపాల్ నీకు బాగా నచ్చాడన్నమాట!" కన్నుకొట్టి కొంటెగా అంది లావణ్య.

ఫ్రెండ్ నెత్తిమీద చిలిపిగా మొట్టికాయ వేసి "నచ్చడం, నచ్చకపోవడం కాదు. యంసీఏ పాసై క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయి కూడా ఉద్యోగం వద్దని పాడి పరిశ్రమ ప్రారంభించిన అతని ప్రత్యేక వ్యక్తిత్వం..." అర్చన అంటూండగానే-

"నేను చెప్పేదీ అదే. గోపాల్ నీకు నచ్చేశాడు" అల్లరిగా నవ్వింది లావణ్య.

"అది కాదే! పాడి అంటే పేడ, పంచితం, కంపు, దోమలు! అక్కడ ఉండలేనని సంకోచం. నువ్వుకూడా ఉద్యోగం చెయ్యకు. ఇంట్లో కూర్చుని పేడ ఎత్తి, పిడకలు చేసి అమ్ముకో అంటాడేమోనని భయం" జోక్‌లాగ చెప్పి నవ్వబోయింది అర్చన. కానీ ఆ నవ్వు సగంలోనే ఆగిపోయింది.

"ఒకసారి వాళ్లింటికెళ్లి చూస్తే బెటర్ కదా!" సాలోచనగా అంది లావణ్య.

"అమ్మానాన్నల కిష్టం లేదు. ఈ సంబంధాన్ని వదిలేసినట్టే"

"అయితే నువ్వూ వదిలెయ్"

ఆ సలహా అర్చనకు నచ్చినట్టు లేదు. ముఖం ముడుచుకుంది. లాలనగా ఆమె భుజంమీద చెయ్యి వేసి "మన తల్లిదండ్రుల తరం వేరు అర్చనా! వాళ్లకి మార్పు, కొత్త అంటే భయం. మంచి ఉద్యోగం చేస్తున్నవాడికి పిల్లనిస్తే భద్రత ఉంటుందని వారి నమ్మకం. స్వయంకృషితో పైకి రావాలనుకునేవాడిని నమ్మలేరు. అమ్మాయి కాపురానికి భద్రత ఉండదని వారి భయం. కానీ మనం అలా ఆలోచించనక్కరలేదు. గోపాల్ ఇంటికి వెళ్దాం. స్వయంగా అంచనా వేద్దాం" అని ధైర్యం చెప్పింది లావణ్య.

అయితే స్వతంత్రించి తను వాళ్లింటికి వెళ్తే వాళ్లు తన గురించి ఏమనుకుంటారో అని అర్చన భయం.

లావణ్య ఒక పథకం వేసింది. వాళ్ల పెదనాన్నగారిది గోపాల్‌గారి పక్క గ్రామమే. పది మైళ్ల దూరం. ముందుగా పెదనాన్నగారింటికి వెళ్లి ఏదో మిషమీద గోపాల్‌గారింటికి వెళ్లవచ్చు.

"నేను మేనేజ్ చేస్తాను కదా!" నమ్మకంగా అంది లావణ్య.

* * *

స్కూటర్ మీద లావణ్య వెనక కూర్చున్న అర్చన అంత దూరంలో గోపాల్‌గారిల్లు చూసి ఆశాభంగం చెందింది.

చెట్లమధ్య నుంచి ఇంటి పైకప్పు కనిపిస్తోంది. అది గడ్డితో నేసినట్లు ఉంది.

పాడి పరిశ్రమ నడిపే కోటీశ్వరులు ఉండేది గడ్డిపాకలోనా! తక్షణం వెనుదిరిగి వెళ్లిపోవాలనిపించింది అర్చనకు.

లావణ్య స్కూటర్ ఆపింది. ఇద్దరూ కిందకు దిగారు. ఇంతదూరం వచ్చి వెనుదిరగడం సమంజసం కాదనీ, వాస్తవాలు కళ్లారా చూద్దామని నచ్చజెప్పింది లావణ్య. ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో కాసేపు చర్చించుకుని బయలుదేరారు.

ఇంటి ముందున్న అందమైన గార్డెన్ దాటి గుమ్మంలో అడుగుపెట్టగానే-

హాలులో చాపమీద కూర్చున్న అమ్మ ఒడిలో తలపెట్టుకుని కింద నడుంవాల్చి ఏదో చెబుతున్న గోపాల్, అతని ముంగురులు సవరిస్తూ మురిసిపోతున్న అమ్మ!

ఆ దృశ్యాన్ని చూస్తూ ఎంతసేపైనా ఉండిపోవాలనిపించింది గుమ్మంలో ఉన్న ఇద్దరమ్మాయిలకూ.

కానీ హఠాత్తుగా వరలక్ష్మమ్మ దృష్టి వారిమీద పడటం, ఆమె కొడుక్కి సైగ చేయడం, అతడు దిగ్గున లేచి నిలబడటం, ఆమె కూడా లేచి వాళ్లని ఆప్యాయంగా ఆహ్వానిస్తూ "మీ అమ్మానాన్నా రాలేదా అర్చనా?" అని అడగటం జరిగిపోయాయి.


"లేదు ఆంటీ! పక్క గ్రామంలో వుంటున్న మా పెదనాన్నగారింటికి వెళ్తూ అర్చనని సాయం రమ్మన్నాను. ఆ ఇంట్లో అందరూ మీ పాడి పరిశ్రమ గురించి గొప్పగా చెబితే చూడాలని వచ్చాం. నేనొక న్యూస్ ఛానల్‌కి కార్యక్రమాలు నిర్మించే నిర్మాతను. కొత్త విషయాలు తెలుసుకొని ప్రజలకు అందించడమే నా పని" నవ్వుతూ అంది లావణ్య.

వరలక్ష్మమ్మ తెచ్చి ఇచ్చిన కొబ్బరినీళ్లు తాగుతూ ఇల్లంతా కలియజూసి "మీ ఇల్లు దూరం నుంచి పూరిపాకలాగా కనిపించినా లోనికొచ్చి చూస్తే అద్భుతంగా

వుంది" అని మెచ్చుకుంది లావణ్య. ఇంటిని ఎవరు మెచ్చుకున్నా వరలక్ష్మమ్మ పొంగిపోతూ గృహనిర్మాణ పురాణం విప్పుతుంది.

నాలుగు బెడ్‌రూంల ఆ డాబాని మామూలుగానే కట్టినా డాబామీద జమ్ముగడ్డితో పందిరి వేశారు. ఇంటి గోడలకు బయట వైపు మొత్తం టేకు చెక్కలు తాపడం చేయించి, లోపలి గోడలనిండా అద్భుతమైన దారు కళాఖండాలతో అలంకరించారు.

వాటిని మైసూర్ రోజ్‌వుడ్ ఇన్‌లే వర్క్ అంటారు. మైసూర్‌లోని ఒక గ్రామంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆ కళాకారుల కుటుంబాలున్నాయి. కాగితం మీద కావలసిన చిత్రం గీసుకొని దాని ప్రకారం రంగురంగుల కొయ్యముక్కల్ని కోసి ముఖం, ముక్కు, కళ్లు, చెవులు, కేశాలు, ప్రకృతి దృశ్యాలుగా తీర్చిదిద్ది వాటిని చిత్రంలో వున్న మాదిరిగా రోజ్‌వుడ్ ఫలకం మీద అంటించి పాలిష్ పెడతారు. ఈ కళ మైసూర్‌లోని ఆ గ్రామానికే ప్రత్యేకం.



"ఆ పందిరి వల్ల, ఈ వుడ్‌వర్క్‌వల్లా ఏసీ పెట్టుకున్నట్లు ఇల్లు చల్లగా వుంటుంది. ఇల్లు కట్టడానికి అయిన ఖర్చుకి రెట్టింపు అయింది ఈ అలంకారాలకు. ఇదంతా అబ్బాయి ఐడియానే" మురిపెంగా చెప్పింది వరలక్ష్మమ్మ.

ఆశ్చర్యంగా వింటూ ఉండిపోయిన లావణ్య, అర్చనలను గోశాలకు తీసుకువెళ్లాడు గోపాల్.

పొడవాటి షెడ్‌లో వరుసగా అరవై ఆవులు దాణా మేస్తున్న దృశ్యం ఎంతో ముచ్చటగా వుంది. అవన్నీ జెర్సీ సంకర జాతి ఆవులు. గోపాల్ ప్రతి ఆవు వద్దకెళ్లి వీపు నిమిరి, గంగడోలు సవరించి, మెడమీద ముద్దుపెట్టుకుంటే అవి మేత ఆపి తల పైకెత్తి తోక ఊపుతూ అతని వైపు చూస్తున్నాయి. వాటి గుండ్రని పెద్ద కళ్లలో కాంతి, తడి తళుక్కుమంటున్నాయి. మనుషుల్లాగే వీటికీ సెంటిమెంట్లున్నాయి కాబోలు.

చివరగా వట్టిపోయిన మూడు ఆవులున్నాయి. వాటిని కబేళాకు తోలివేయకుండా మిగిలిన ఆవులతో సమానంగా మేత పెడుతూ ప్రేమగా చూసుకుంటున్నాడు. వాటిలో ఒక ఆవుని అమ్మ పెళ్లి సందర్భంగా కట్నంగా ఇచ్చారట. "ఈ తల్లిపాలు కూడా తాగి పెరిగాను నేను" అంటూ పరవశంగా ఆ ఆవు మెడ కౌగిలించుకుంటున్న గోపాల్ ఒక అద్భుత వ్యక్తిలాగా కనిపించాడు అర్చనకు.

తర్వాత ముగ్గురూ డాబామీదకు వెళ్లారు.

డాబామీద పేరుకు పందిరేగాని పెద్దహాలులాగా వుంది. రంగురంగుల వెదుళ్లతో సైడ్‌వాల్స్‌లాగా నిర్మించిన కటకటాలు, వాటికి వేలాడుతూ రకరకాల ఆకారాలతో వెదురుతో చేసిన పూసల దండలు. అక్కడ టేబుళ్లు, కుర్చీలు రంగులు వేసిన వెదురు బొంగులతో చేసినవే. అందాల పర్ణశాలలాగ ఉందా హాలు. ముగ్గురూ కుర్చీల్లో కూర్చున్నారు.

"ఆవుల పోషణ ఆషామాషీ కాదు. ఎంతో శాస్త్రం తెలియాలి. ఎందర్నో సంప్రదించాలి. ఒక్క ఆవుతో ప్రారంభించాను. చక్కని పోషణ వల్ల పాల దిగుబడి బాగా వచ్చింది. బ్యాంక్ లోన్ తీసుకుని మరిన్ని ఆవులు కొని ఆధునిక పద్ధతిలో సాకాను. పాల అమ్మకంతో వచ్చిన లాభంతో మళ్లీ ఆవులు కొంటూ మూడేళ్లలో అరవై ఆవుల యజమాని అయ్యాను.

ఉత్పత్తి పెంచడానికి ఆవులకు సంగీతం వినిపించాను. పాలు పితికే యంత్రాలు వాడుతున్నాను. గోశాలలో మురికి, పేడ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నా. ఆవులు ఎండను తట్టుకోలేవు. చల్లదనం కోసం కృత్రిమ జల్లులు, మంచు కురిపించే ఫాగర్స్ ఏర్పాటు చేశాను. ఆవులకు కుడితి, గడ్డి చాలదు. మా పొలంలో సుబాబుల్, అవిశ, అలచంద, లూసర్న్, ముంబాస లాంటివి పెంచి పశుగ్రాసం సమకూర్చుతున్నా. గోశాలకు దోమతెరలు కూడా ఉన్నాయి. క్రమం తప్పకుండా పశువుల డాక్టర్ వచ్చి చెకప్ చేస్తాడు. ఈ శ్రమకు తగ్గట్టే నెలకు డెబ్బయి వేలు పైగా సంపాదిస్తున్నా. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జీతం కంటే ఎక్కువే!" సంతృప్తిగా నవ్వాడు గోపాల్.

బయోగ్యాస్ యూనిట్ ఉందట. అందువల్ల వంట గ్యాస్, కరెంట్ కష్టాలు లేవు. పాలను చిల్లింగ్ చేసి ప్యాకెట్లు తయారు చేసే యూనిట్ కూడా ఉందట. వాటిని చూడడానికి రమ్మన్నాడు గోపాల్.

"ఇక్కడింత విషయం ఉందని తెలియక ఆషామాషీగా చేతులూపుకుంటూ వచ్చాం. వచ్చే ఆదివారం మా వీడియోగ్రాఫర్‌తో వచ్చి అన్నీచూసి అన్నీ చిత్రీకరించి మీ ఇంటర్వ్యూ తీసుకుంటాను. ఇప్పటికి వదిలేయండి. ఆలస్యం అయితే అర్చన తల్లిదండ్రులు కంగారుపడతారు" సర్దిచెప్పింది లావణ్య.

ఈలోగా పనిమనిషి తెచ్చిన టిఫిన్ తింటూ "ఇంతకూ ఉద్యోగం వద్దని ఈ పరిశ్రమ ప్రారంభించడానికి కారణం?" అడిగింది లావణ్య.

కాసేపు గంభీరంగా ఉండిపోయాడు గోపాల్. తర్వాత-

"మా బావ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. జీతం యాభైవేలు. పెళ్లయిన కొత్తలో అక్క ఆనందంగానే ఉండేది. కాని ఇప్పుడామె ముఖంలో దిగులు తప్ప సంతోషం లేదు. పని ఒత్తిడి వల్ల, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల బావకు టెన్షన్. అందువల్ల అక్కకు ఆందోళన. బావ రాత్రి పన్నెండు దాటాకగాని ఇంటికి రాలేకపోతున్నాడు. సినిమాలు, షికార్లు, హోటల్ భోజనాలు బంద్!" అంటూ ఉండగానే పనిమనిషి టీ తెచ్చింది.

"వ్యక్తిగత స్వేచ్ఛ, సుఖసంతోషాలు కోల్పోయాక ఎంత జీతం వస్తేమాత్రం ఏం లాభం? అందుకే ఉద్యోగం వద్దనుకున్నాను. ఇంకో కారణం కూడా వుంది. నా ఫ్రెండ్ హనీల్‌రెడ్డి యంసీఏ పాసైనా ఉద్యోగం వద్దనుకొని ఎనభై ఆవుల ఆసామీ అయి నెలకు లక్ష రూపాయలు సంపాదిస్తున్నాడు. అతనిని ఆదర్శనంగా తీసుకున్నాను. నాకే టెన్షన్లు లేవు. అమ్మానాన్నలతో హాయిగా ఉన్నాను. నేను ఉద్యోగిని కాను, యజమానిని!" సగర్వంగా చెప్పాడు గోపాల్.

అర్చన హృదయం ఆరాధనా భావంతో నిండిపోయింది.

"మీరెవరినైనా ప్రేమించారా?" హఠాత్తుగా అడిగింది లావణ్య. "పెళ్లయాక భార్యమీద కురిపించాలని నా ప్రేమను దాచుకున్నాను" గలగలా నవ్వేశాడు గోపాల్. తనూ నవ్వేస్తూ మీకెలాంటి భార్య కావాలని అడిగింది లావణ్య.

ఒక్కసారిగా గంభీరంగా మారిపోయాడు గోపాల్. ఎటో చూస్తూ ఎవరితోనో చెబుతున్నట్లు "అందరిలాగే నేనూ చదువుకున్న భార్యే కావాలనుకున్నాను. మూడు పెళ్లిచూపులకు వెళ్లాను కూడా. నేను పాలబ్బాయిని అని చెప్పగానే అందరూ ముఖాలు ముడుచుకొని తిరస్కరించారు. నా భర్త డైరీమిల్క్ బిజినెస్ అని చెప్పుకోవడం చదువుకున్న ఏ యువతికైనా నామోషీగానే ఉంటుందేమో. తమ అల్లుడు పాలు అమ్ముకుంటాడని చెప్పడం ఎవరికైనా పరువు తక్కువే. వారిని తప్పుపట్టను. అందువల్ల ఇంక పెళ్లిచూపులు మానేసి ఐదోక్లాసు చదివిన అప్పలమ్మెవరినైనా వెతుక్కుంటే బెటర్ అనిపిస్తోంది. ఆమె అయితే ఇంట్లో ఉంటుంది. ఉద్యోగం చేస్తాను అనదు" జోక్ లాగ చెప్పబోయాడుగానీ అతని స్వరంలో గింగురుమంటున్న బాధ తెలుస్తూనే వుంది.



అంతవరకు అతనినే తన్మయంగా చూస్తున్న అర్చన తల వాలిపోయింది. ఈ ఇల్లు, ఈ వాతావరణం ఆమెకెంతగానో నచ్చాయి. అతని వ్యక్తిత్వం, మాటలు ఆమెను పరవశింపజేస్తున్నాయి. అతడుత్తి పాలబ్బాయి మాత్రమే కాదు కుటుంబాన్ని చక్కగా పాలించే అబ్బాయి అనిపిస్తోంది.

"భార్య ఉద్యోగం చేయడం మీకిష్టం లేదన్నమాట!" అర్చన వైపు క్రీగంట చూస్తూ అతనిని అడిగింది లావణ్య.

"భార్యాభర్తలిద్దరూ ఒకే ఊళ్లో ఉద్యోగాలు చేస్తే మంచిదే. కానీ భార్య ఒక ఊళ్లో, భర్త మరో ఊళ్లో అయితే వాళ్లు సెలవురోజుల్లోనే కలుస్తారు. వాళ్లది సంపూర్ణ సుఖసంతోషాల సంసారం అవదు. అలాంటి పరిస్థితి నాకిష్టం లేదు. నేనీ గ్రామం విడిచి వెళ్లే అవకాశం లేదు. అంతగా ఉద్యోగం చేయాలనుకుంటే నా భార్యకు నేనే ఉద్యోగం ఇస్తాను నా అసిస్టెంట్‌గా. జీతమూ ఇస్తాను. లేదా మన జిల్లాల్లో గేదె పాలకు మంచి డిమాండ్ వుంది. కొన్ని గేదెలు కొని ఇస్తాను. నా భార్య వాటి పోషణ, పాల విక్రయం చూసుకుంటూ జీతం తీసుకోవచ్చు" వివరించాడు గోపాల్.

"ఇక్కడకు రావడం వల్ల ఎన్నో కొత్తవిషయాలు తెలిశాయి. మీపట్ల గౌరవం, ఆరాధన కలుగుతోంది" మనస్ఫూర్తిగా అంటూ రెండు చేతులూ జోడించి నమస్కరించింది లావణ్య.

"నాకంత సీన్ లేదండీ! నా ఫ్రెండ్ హనీల్ నడిచిన దారిలో వెళ్తున్నాను. అంతే. అతడు యంసీఏకి మాస్టర్ ఆఫ్ కౌ అప్లికేషన్స్ అని కొత్త అర్థం చెప్పాడు. నేనూ అదే అంటాను" నవ్వేశాడు గోపాల్.

లావణ్య గబగబా డాబా మెట్లు దిగుతూ ఉండగా వెనక ఉన్న గోపాల్ చేతిని తన చేతుల్లోకి తీసుకొని "మీరు ఐదోక్లాసు అప్పలమ్మని కాక ఇంచక్కా బిటెక్ అమ్మాయినే పెళ్లి చేసుకోవచ్చు" అంది తియ్యగా అర్చన.

"అప్పుడు బిటెక్‌కి కొత్త అర్థం చెప్పవచ్చు బఫెలో టెక్నిక్- అని" నవ్వేశాడు గోపాల్. అతని నవ్వుతో శృతి కలిపింది అర్చన.

(గమనిక:- యంసీఏ పాసైనా ఉద్యోగం వద్దని ఆవుల పెంపకం చేపట్టి విజయం సాధించిన హనీల్ రెడ్డి గురించి వార్తాకథనం ఒక దినపత్రికలో వచ్చింది. ఆ ప్రేరణతో రాసిన కథ ఇది.)

○

## మరో కన్నడ భామ

**షారుఖ్ ఖాన్‌తో 'ఓం శాంతి ఓం' సినిమాలో నటించి బాలీవుడ్ తెరకి పరిచయమైన కన్నడ భామ 'దీపికా పదుకొనె' ఈరోజు టాప్ హీరోయిన్‌గా రాణిస్తోంది. తాజాగా మరో కన్నడ అమ్మాయిని తన పక్కన హీరోయిన్‌గా నటింపచేసాడు షారుఖ్. 'రబ్‌నే బనాది జోడీ' సినిమాలో షారుఖ్‌కి జంటగా నటించిన అనుష్క శర్మ ఇప్పుడు బాలీవుడ్ జనాల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. షారుఖ్ వయసులో సగమే (సగం కన్నా ఇంకా తక్కువే, 18 ఏళ్లేనట) వయసుగల అనుష్క ముందు ముందు ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో!**